నేడు ప్రజా పాలన దినోత్సవం

నిజాంపేట్: నిజాంపేట్ నగర పాలక సంస్థ కార్యాలయ ఆవరణలో జాతీయ పతాక ఆవిష్కరణ నిర్వహించనున్నట్లు కమిషనర్ సాబేర్ అలీ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని నిజాంపేట్ నగర పాలక సంస్థ కార్యాలయ ఆవరణలో బుధవారం ఉదయం 9:30 గంటలకు జెండా ఆవిష్కరణ ఉంటుందన్నారు.

నవరాత్రుల సందర్భంగా ప్రత్యేక పూజలు

జగద్గిరిగుట్ట: దేవీ నవరాత్రుల సందర్భంగా జగద్గిరిగుట్ట, మగ్దూం నగర్‌లోని మల్లికార్జున స్వామి దేవాలయలంలో అమ్మవారికి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ప్రతిరోజు ఉదయం చండీ పారాయణం, సాయంత్రం హారతి, మంత్రపుష్పార్చన కార్యక్రమాలు, రాత్రి పూజా అనంతరం అన్నప్రసాద కార్యక్రమం ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

కట్టమైసమ్మ ఆలయంలో అన్నదానం

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ శ్రీకట్ట మైసమ్మ ఆలయం వద్ద మంగళవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్థానికంగా ఉండే పీవీఎస్ సుబ్బారావు కుమార్తె నవ్య పావని పుట్టినరోజు సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధి వివేక్ రెడ్డి, శైలజ దంపతుల ఆధ్వర్యంలో అభిషేకం నిర్వహించారు. సుమారు 500 మందికి పైగా భక్తులు అన్నదానంలో పాల్గొన్నారు.

కేబుల్ వైర్లు తొలగించరా?

కొద్ది రోజులే హడావుడిగా తొలగింపు

రంగారెడ్డినగర్: ఏదైనా ప్రమాదం జరిగినపుడు హంగామా చేయడం.. ఆ తరువాత చర్యలు చేపట్టకపోవడం అధికారులకు పరిపాటిగా మారింది. గత నెల గణేశ్ ఉత్సవాల నేపథ్యంలో పాతబస్తీ బండ్లగూడలో విగ్రహాన్ని తరలిస్తుండగా విద్యుత్ స్తంభానికి ఉన్న కేబుల్ వైర్లు తాకడంతో విద్యుదాఘాతానికి గురై మృత్యువాత పడిన ఘటనతో విద్యుత్ శాఖ అధికారులు జీహెచ్ఎంసీ వ్యాప్తంగా స్తంభాలకు ఉన్న కేబుల్ వైర్ల తొలగించేందుకు ఉపక్రమించారు. కుత్బుల్లాపూర్, గాజులరామారం సర్కిళ్ల పరిధిలో వారం రోజుల పాటు ప్రధాన రహదారుల్లోని విద్యుత్ స్తంభాలకు ఉన్న కేబుల్ వైర్లను తొలగించారు.ఆ తర్వాత విద్యుత్ అధికారులు, సిబ్బంది కనిపించకుండా పోయారు. దీంతో ప్రధాన రహదారుల వెంబడి విద్యుత్ స్తంభాలకు కేబుల్ వైర్లు కుప్పలుగా చుట్టుకుని దర్శనమిస్తున్నాయి. ఐడీపీఎల్ నుంచి షాపూర్‌నగర్‌కు వెళ్లే రోడ్డులో, చింతల్ మార్కెట్ రోడ్డు, జగద్గిరిగుట్ట రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలకు ఉన్న కేబుళ్లను తొలగించలేదు. దీంతో ఏదైనా ఘటన జరిగితే స్పందిస్తారా? అంటూ అధికారుల తీరుపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



చింతల్ ప్రధాన రహదారిలో ..



చింతల్ మార్కెట్ రోడ్డులో విద్యుత్ స్తంభానికి కుప్పలుగా ఉన్న కేబుల్ వైర్లు

పార్కు స్థలాన్ని పరిరక్షించాలని ఎంపీకి వినతి



ఎంపీ ఈటల రాజేందర్‌ను సన్మానిస్తున్న అసోసియేషన్ సభ్యులు

సుభాష్‌నగర్: సుభాష్‌నగర్ డివిజన్ సూరారం సిద్ధివినాయకనగర్‌లో కబ్జా చెరలో ఉన్న పార్కును కాపాడాలని బీజేపీ నాయకులతో కలిసి అసోసియేషన్ సభ్యులు మంగళవారం ఎంపీ ఈటల రాజేందర్‌ను కలిశారు. కాలనీకి కేటాయించిన పార్కు స్థలాన్ని ఓ వ్యక్తి కబ్జా చేసేందుకు ప్రయత్నించగా అడ్డుకున్నామని తెలిపారు. ప్రస్తుతం ప్రహరీ నిమిత్తం నిధులు మంజూరైన సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయమై ఎంపీ సంబంధిత జోనల్ కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడి సత్వరమే సదరు పార్కు స్థలంలో ప్రహరీ నిర్మించి స్థలాన్ని కాపాడాలని ఆదేశించారు. కార్యక్రమంలో కంది శ్రీరాములు, దారం సాయికుమార్, కొట్టే రవి, కాలనీ ప్రెసిడెంట్ లక్ష్మీనారాయణ, వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వరద ప్రాంతాలను పరిశీలించిన అధికారులు



కుత్బుల్లాపూర్ : కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఉమామహేశ్వర కాలనీలో వరద నీరు మంగళవారం సైతం యధావిధిగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. గతంలో ఇక్కడ ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలు చేపట్టిన విషయంపై ఇరిగేషన్ శాఖ అధికారులు తక్షణమే ఇక్కడ నిర్మాణదారులు ఖాళీ చేయాలని ఆదేశాలు జారీ చేసినప్పటికీ ఐదు సంవత్సరాలుగా వర్షం పడ్డ ప్రతిసారి ఈ కాలనీ ప్రజలు నరకం చూస్తున్నారు. రెండు రోజులైనా వర్షపు నీరు వెళ్లకపోవడంతో ఫాక్స్‌సాగర్ చెరువు నిండుతూ రావడం, ఇప్పటికే ఉమామహేశ్వర కాలనీ సగం వరకు వర్షపు నీటిలోనే ఉంది. ఈ నేపథ్యంలో కొంపల్లి మున్సిపల్ మాజీ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్, మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి మంగళవారం కాలనీలో పర్యటించి ప్రజలకు ధైర్యం చెప్పారు. తమకు మౌలిక వసతులు కల్పించే దిశగా ప్రయత్నం చేయాలని స్థానికులు మున్సిపల్ కమిషనర్‌ను కోరారు.

సులభంగా డబ్బులు సంపాదించాలని బైకుల చోరీ

నిందితుడి రిమాండ్

సుభాష్‌నగర్: ద్విచక్ర వాహనాలను తస్కరించి తప్పించు తిరుగుతున్న వ్యక్తిని సూరారం పోలీసులు రిమాండ్ చేశారు. మంగళవారం మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి, ఏసీపీ శంకర్‌రెడ్డి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బైక్ దొంగతనాల వివరాలను వెల్లడించారు. మెదక్ జిల్లా నర్సాపూర్ ఎన్‌జీవోస్ కాలనీకి చెందిన మహ్మద్ సాధిక్(35) ప్లంబింగ్ పనులు చేస్తుంటాడు. సులభంగా డబ్బులు సంపాదించాలనే ఆశతో బైక్‌ల చోరీలకు అలవాటు పడ్డాడు. ఈ క్రమంలో సూరారం మల్లారెడ్డి ఆస్పత్రి ఎదురుగా పార్కింగ్‌లు చేసే 10 ద్విచక్ర వాహనాలను అపహరించాడు. ఈ మేరకు పలువురి నుంచి ఫిర్యాదులు అందుకున్న సూరారం పోలీసులు సీసీ ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. మంగళవారం సూరారం చౌరస్తాలో వాహనాల తనిఖీలు చేపట్టగా.. టీఎస్15 ఈఎస్ 5053 హీరో హోండా గ్లామర్ బైక్‌పై వచ్చిన సాధిక్‌ను ఆపి సంబంధిత పత్రాలు చూపించాల్సిందిగా అడుగగా బండారం బయటపడింది. అతను పొంతనలేని మాటలు చెప్పడంతో అనుమానం వచ్చిన పోలీసులు స్టేషన్‌కు తీసుకువెళ్లి తమదైన శైలిలో విచారించారు. పది బైక్‌లను చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడు. అతని నుండి పది బైక్‌లను సీజ్‌చేసిన పోలీసులు నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. నిందితుడిని పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన సీఐ సతీష్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ ఎం.రాజు, ఎస్ఐ ఆనందం, ఏఎస్ఐ శివకుమార్, హెడ్ కానిస్టేబుళ్లు హరిబాబు, రమేష్‌నాయక్, కానిస్టేబుల్ కృష్ణలను డీసీపీ అభినందించారు.



కార్మికనేత మదన్‌గౌడ్‌కు సన్మానం

కుత్బుల్లాపూర్: కార్మికుల హక్కుల పరిరక్షణ, సదుపాయాలను కల్పించేందుకు పరిశ్రమల యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలని ఐఎన్‌టీయూసీ నేత, శ్రమ శక్తి అవార్డు గ్రహీత ముద్దాపురం మదన్‌గౌడ్ అన్నారు. జీడిమెట్ల పారిశ్రామికవాడలోని రాశీఎంటర్‌ప్రైజెస్ పరిశ్రమ వేతన సవరణకు అంగీకరించింది. దీంతో ఆయనను మంగళవారం ఏపీఎస్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు మెరుగైన వేతన ఒప్పందం చేయడం జరిగిందని, రూ.7వేల పెంపుదలతో పాటు ఇతర అలవెన్స్‌లు ఇచ్చేందుకు యాజమాన్యం అంగీకరించిందన్నారు. కార్యక్రమంలో సాయన్నగౌడ్, భాను, శివ,నాగేందర్ బాబు, దేవేందర్ పాల్గొన్నారు.

మాక్సివిజన్ ఆస్పత్రి ప్రారంభం

కుత్బుల్లాపూర్: నేత్ర వైద్యరంగంలో ప్రఖ్యాత సంస్థ మాక్సి విజన్ కొంపల్లిలో 13వ శాఖ ఆస్పత్రిని మంగళవారం ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, సూపర్ స్పెషాలిటీ కో చైర్మన్ డాక్టర్ కాసు ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నగరంలో పెరుగుతున్న జనాభాకు ప్రపంచస్థాయి కంటి సంరక్షణ సేవలను అందించడంలో మాక్సి విజన్ ముందుంటుందన్నారు.

సీఎంని కలిసిన కిషోర్‌రెడ్డి



దుండిగల్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బొంగునూరి కిషోర్‌రెడ్డి మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన్ని శాలువతో సత్కరించి అనంతరం దుండిగల్ మున్సిపల్ పరిధిలో అభివృద్ధి పనులపై సీఎం దృష్టికి తీసుకువెళ్లారు. పాలకమండలి పదవి కాలం ముగియడంతో ప్రత్యేక పాలనలో అభివృద్ధి పనులు మందగించాయని, ప్రత్యేక నిధులు మంజూరు చేసి స్థానిక అభివృద్ధికి సహకరించాలని కిషోర్‌రెడ్డి కోరారు.